సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ; 25 ; జనవరి ; 2025



టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.9 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.5°/12.1°

జిల్లాలో శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

తెగ తాగేశారు!

కూటమి సర్కార్ ఉగ్గుపాలు పట్టినట్లు జనానికి మద్యం పట్టిస్తోంది. ఊరూరా బెల్టుదుకాణాలకు అనధికార అనుమతులిచ్చి ముంగిళ్లలోనే మద్యం అందిస్తోంది. అధికారిక దుకాణాల ద్వారా ఖజానా నింపుకుంటూ, అనధికార దుకాణాల ద్వారా తమ్ముళ్లకు దోచిపెడుతోంది. మందుబాబుల రెక్కల కష్టాన్ని తాగేస్తూ కుటుంబాలను రోడ్డున పడేస్తోంది.



- జిల్లాలో భారీగా పెరిగిన మద్యం విక్రయాలు
- వంద రోజుల్లో 29.56 లక్షల లీటర్ల మద్యం సేల్
- ఇప్పటికే జిల్లాలో 87 మద్యం దుకాణాల ఏర్పాటు
- తాజాగా మరో 9 మద్యం దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

సాక్షి, పుట్టపర్తి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. ఆంధ్ర లిక్కర్‌తో పాటు అక్రమంగా హర్యానా, మహారాష్ట్ర, గోవా మద్యం, నాటుసారా, కల్తీ కల్లు కూడా ఊరూరా అందుబాటులో ఉంచింది. అందుకే గతేడాది అక్టోబరు 16వ తేదీ నుంచి ఈనెల 23వ తేదీ వరకు అంటే 100 రోజుల్లో జిల్లాలోని 87 మద్యం దుకాణాల ద్వారా రూ.181.46 కోట్ల విలువ చేసే మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో బీర్లు 82,662 కేసులు, లిక్కర్ 2,54,981 కేసులు అమ్మకాలు జరగడం గమనార్హం. లీటర్ల ప్రకారం లెక్కవేస్తే సుమారు 30.38 లక్షల లీటర్ల మద్యాన్ని కూటమి సర్కార్ జనంతో తాగించింది. ఇక బెల్టుషాపులు, వివిధ రాష్ట్రాల మద్యం వినియోగం లెక్కవేస్తే అంకెలకే కైపెక్కుతుంది.

వందరోజుల్లో జిల్లా పరిధిలో మద్యం విక్రయాలు ఇలా...

ఎక్సైజ్ స్టేషన్	బీర్లు (కేసులు)	మద్యం (కేసులు)	రాబడి (రూపాయలు)
సీకే పల్లి	4,875	14,111	9,92,68,139
ధర్మవరం	18,756	57,069	41,49,71,694
హిందూపురం	10,933	39,107	27,77,91,374
కదిరి	1,2618	36,563	26,79,62,729
మడకశిర	5,570	20,672	12,96,31,443
పెనుకొండ	13,911	38,974	28,17,48,332
పుట్టపర్తి	10,210	30,406	21,90,96,988
తనకల్లు	5,789	18,079	12,41,39,894
మొత్తం	82,662	2,54,981	181,46,10,595

కొత్తగా మద్యం షాపులు ఏర్పాటయ్యే ప్రాంతాలు..

కదిరి టౌన్, హిందూపురం టౌన్, హిందూపురం రూరల్, తాడిమర్రి, ధర్మవరం టౌన్, చిలమత్తూరు, పుట్టపర్తి రూరల్, పెనుకొండ రూరల్, ఎన్‌పీ కుంట.



ధర్మవరంలోనే అధికం..

జిల్లాలోని ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగాయి. స్టేషన్ పరిధిలో 20 దుకాణాలుండగా, వంద రోజుల్లో రూ.41.49 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరగడం విశేషం . దీనికి తోడు బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. రూరల్ పరిధిలో దుకాణం ఏర్పాటుకు అనుమతులు తీసుకుని.. పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నా..పట్టించుకునే వారు కరువయ్యారు. మద్యం దుకాణాల నుంచి ఎక్సైజ్ అధికారులు మామూళ్లు తీసుకుని పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా బెల్టు షాపుల నిర్వహణలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

రోడ్డున పడుతున్న కుటుంబాలు..

గత వైఎస్సార్ సీపీ సర్కార్ మద్యం విక్రయాలను కట్టడి చేసింది. దీంతో చాలా మంది మద్యం మానేసి కుటుంబాలతో హాయిగా ఉండేవారు. కానీ కూటమి సర్కార్ ముంగిళ్లలోనే మద్యం అందుబాటులోకి తేవడంతో వారంతా మళ్లీ 'మందు'బాట పట్టారు. రెక్కల కష్టాన్ని గొంతులో పోసుకుంటూ ఉత్తి చేతులతో ఇంటికి వెళ్తున్నారు. ఇంటిపెద్ద మత్తుకు బానిసకాగా..కుటుంబం ఆర్థికంగా చితికిపోయి రోడ్డునపడుతోంది. చిన్నారుల చదువులు చట్టుబండలవుతున్నాయి.

ఊరూరా అక్రమ మద్యం..



వందరోజుల్లో జిల్లాలోని మద్యం దుకాణాల ద్వారా రూ.181.46 కోట్లు విలువైన లిక్కర్ సేల్ అయ్యింది. ఇక అక్రమంగా జిల్లాకు వచ్చిన కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, హర్యానా మద్యం విలువ లెక్క కడితే మరో రూ.100 కోట్లు దాటవచ్చని అంచనా. హిందూపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలే ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాల్లోనే లేబుళ్లు మార్చి విక్రయాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒత్తిడి పెరగడంతో ఎక్సైజ్ విజిలెన్స్ బృందం దాడులు చేసి అక్రమ మద్యాన్ని పట్టుకోవడంతో పాటు.. నిర్లక్ష్యం వహించిన సీఐపై వేటు కూడా వేసిన సంగతి తెలిసిందే.

08	87	09
జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్లు	జిల్లాలో ఉన్న మద్యం దుకాణాల సంఖ్య	కొత్తగా ఏర్పాటు చేయనున్న దుకాణాలు

29,56,125 లీటర్లు
వంద రోజుల్లో మద్యం వినియోగం

రూ. **181.46** కోట్లు
ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం



న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు



పరేడ్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి టౌన్: గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ మేరకు పుట్టపర్తి ప్రశాంతి గ్రాం వద్ద ఉన్న పోలీస్ పరేడ్ మైదానంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం గణతంత్ర వేడుకల ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సౌండ్ సిస్టమ్, స్టాళ్ల ఏర్పాటు, శకటాల ప్రదర్శన, పరేడ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా పార్కింగ్ స్థలాలు కేటాయించి అధికారులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వీవీపీలు వచ్చే అవకాశం ఉన్నందున పోలీస్ బందోబస్తు కూడా పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. జేసీ వెంట ఆర్డీఓ సువర్ణ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు,

అఫ్జల్ మెహరాజ్‌కు మరో అవకాశం

- అంతర్జాతీయ జూడో ఎంపిక పోటీలకు ఆహ్వానం



విద్యార్థి అఫ్జల్ మెహరాజ్‌తో పీడీ ప్రతాప్‌రెడ్డి

ధర్మవరం రూరల్: స్కూల్ గేమ్స్ జూడో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించిన ధర్మవరం మండలం చిగిచెర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి అఫ్జల్ మెహరాజ్‌కు మరో అవకాశం దక్కింది. భోపాల్‌లోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(ఎన్‌సీఈఓ)లో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ ఎంపిక పోటీలకు ఆహ్వానం అందింది. ఈ పోటీల్లో సత్తా చాటితే అఫ్జల్ మెహరాజ్‌కు ఎన్‌సీఈఓలో సీటు లభిస్తుందని, తద్వారా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించవచ్చని పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అఫ్జల్ మెహరాజ్ జూడోలో గత నాలుగేళ్లుగా అత్యుత్తమంగా రాణిస్తున్నాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అఫ్జల్ మెహరాజ్‌ను అభినందించారు.

నాల్గో తరగతి ఉద్యోగుల అడ్‌హక్ కమిటీ ఏర్పాటు



జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను కలిసిన నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, సభ్యులు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా శాఖ అడ్‌హక్ కమిటీ ఏర్పాటైంది. రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్, ప్రధాన కార్యదర్శి రాజేశ్ ప్రభుకుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అధ్యక్షుడిగా తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా భరత్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, వెంకటయ్యను ఎంపిక చేశారు. సహాయ కార్యదర్శులుగా జగన్నాథ్, గణేశ్, కోశాధికారిగా శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యులుగా రామాంజనేయులు, సరళమ్మ ఎంపికయ్యారు. అడ్‌హక్ కమిటీ ప్రతినిధులు, సభ్యులు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం కింద వివిధ విభాగాల్లో పని చేస్తున్న అటెండర్లు, నైట్ వాచ్‌మెన్లకు, డ్రైవర్ల యూనిఫాం మంజూరుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యను కూడా ఆయన చాంబర్‌లోకి వెళ్లి వారు మర్యాదపూర్వకగా కలిశారు. తమ సమస్యను ఆయనకూ వివరించారు.

గీత కార్మికులకు మద్యం దుకాణాలు

- లాటరీ ద్వారా ఉపకులాలకు కేటాయించిన కలెక్టర్ టీఎస్ చేతన్



లాటరీ తీస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో కల్లు గీత కులాల వారికి రాష్ట్ర ప్రభుత్వం 9 మద్యం షాపులను కేటాయించింది. ఇందులో ఉప కులాలకు ప్రాంతాల వారీగా దుకాణాలు కేటాయించారు. ఏ ఉప కులానికి ఎక్కడ దుకాణం కేటాయించాలో నిర్ణయించేందుకు శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ ఫంక్షన్ హాలులో కలెక్టర్ చేతన్ లాటరీ తీశారు. ఇందులో కదిరి మున్సిపాలిటీ దుకాణం లాటరీలో గౌడ్ కులానికి దక్కింది. అదేవిధంగా తాడిమర్రిలో ఏర్పాటు కానున్న దుకాణం గౌడ కులానికి లభించింది. మిగతా షాపులన్నీ ఈడిగ కులాలకు దక్కాయి. అర్హులంతా దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. లైసెన్సు ఫీజుల్లో 50 శాతం రాయితీ ఉంటుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్ తెలిపారు. కాగా దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు



కవల దూడలకు జన్మనిచ్చిన పాడి ఆవుతో రైతు ఆంజనేయులు

ఎన్‌పీకుంట: మండల కేంద్రానికి చెందిన పాడి రైతు ఆంజనేయులుకు చెందిన ఆవు శుక్రవారం రెండు దూడలకు జన్మనిచ్చింది. సాధారణంగా ఆవులు ఒక దూడకే జన్మనిస్తాయి. కానీ, ఈ ఆవు ఒకే ప్రసవంలో ఒక ఆడ, మరొక మగ దూడకు జన్మనివ్వడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి





శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ బృందం, ముఖ్య అతిథి డాక్టర్ దీపక్ ఓహ్రా, సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి పూర్వ విద్యార్థులు

- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రశాంతి నిలయంలో స్వీయ పరివర్తన కోసం జాతీయ నాయకత్వ లక్షణాలు పెంపొందించే శిక్షణ కార్యక్రమ ప్రారంభమైంది. ఆర్‌జె.రత్నాకర్ రాజుతో పాటు ట్రస్ట్ సభ్యులు డాక్టర్ మోహన్, చక్రవర్తితో పాటు లేహ్, కార్గిల్ ప్రాంతాల అభివృద్ధి ప్రత్యేక సలహాదారు డాక్టర్ దీపక్ ఓహ్రా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సుమారు 1,500 మంది సత్యసాయి విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌జే రత్నాకర్ రాజు మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో అనేక సమస్యలు, సవాళ్లు ఉన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు యువత సిద్ధం కావాలన్నారు. సత్యసాయి బోధనల ఆధారంగా యువత చక్కటి భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. డాక్టర్ దీపక్ ఓహ్రా మాట్లాడుతూ, యువతను సన్మార్గంలో నడిపేందుకు సత్యసాయి బోధనలు ఆచరణీయమన్నారు. అందుబాటులో ఉన్న శాస్త్ర, సాంకేతికత పరిజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని యువత ముందడుగు వేయాలన్నారు. సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో యూత్ సభ్యులు సత్యసాయిని కొనియాడుతూ సంగీత కచేరీ నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ నాయకత్వ లక్షణాలు పెంపుదల శిక్షణ కార్యక్రమం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ యోగీంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోళ్లు ప్రారంభం



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం గీతమ్మ

తాడిమర్రి: జిల్లాలో కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. స్థానిక నరసింహస్వామి రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కందుల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతుల అభ్యున్నతే శ్రీసత్యసాయి రైతు పరస్పర సహాయక సహకార పరిమిత సమాఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. రైతులను దళారీల నుంచి కాపాడి గిట్టుబాటు ధర కల్పించడమే రైతు సంఘం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందుకోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో 12 శాతం తేమ ఉన్న కందులకు క్వింటాల్‌కు రూ.7,550 చెల్లిస్తామన్నారు. కందులు అమ్మకానికి తీసుకుని వచ్చే రైతులు ఆధార్, బ్యాంక్ పాస్ బుక్కు జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. రైతులకు వారం, పది రోజుల్లో డబ్బు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో టీం లీడర్ విశ్వనాథ్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు వరప్రసాద్, గౌరవాధ్యక్షుడు నారాయణరెడ్డి, ఫీల్డు ఆఫీసర్లు సుదర్శన్, రఘు, వేణు, రైతు హరినాథ్ పాల్గొన్నారు.

క్వింటా కందులకు రూ.7,550 మద్దతు

ప్రశాంతి నిలయం: క్వింటా కందులకు ప్రభుత్వం రూ.7,550 మద్దతు ధర నిర్ణయించిందని కలెక్టర్ చేతన్ తెలిపారు. ఈ మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులనుంచి కందులు సేకరిస్తామన్నారు. అయితే ఈ –క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే కందులు కొనుగోలు చేస్తామని, తేమ శాతం 12 లోపు ఉండాలన్నారు. కందుల విక్రయాలకు రైతు సేవా కేంద్రంలో ఇప్పటి వరకు నమోదు చేసుకోని రైతులు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి

- గ్రామ స్థాయి నుంచి కార్యాచరణ ప్రణాళిక
- కార్యకర్తలకు అండగా ఉంటాం
- ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం
- కూటమి నాయకుల బెదిరింపులకు భయపడేదిలేదు
- కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, చిత్రంలో నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

మడకశిర రూరల్: కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తూ వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఛత్రం పంచాయతీ ఈచలెడ్డి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ చెన్నయ్య అధ్యక్షతన వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉషశ్రీచరణ్‌తో పాటు నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే మూలస్తంభాలన్నారు. వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. కూటమి నాయకుల బెదిరింపులకు ఎవరూ భయపడవద్దన్నారు. పనిచేసే ప్రతి కార్యకర్తకూ తప్పక గుర్తింపు ఉంటుందన్నారు.

అన్ని వర్గాలనూ మోసగించారు..

అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు.. ఆ తర్వాత మహిళలు, రైతులు, కూలీలు, విద్యార్థులు..ఇలా అన్ని వర్గాలను మోసగించారన్నారు. అందుకే ఏడు నెలలకే కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం కూడా అందించలేకపోతోందన్నారు. నిరుపేదల ఆరోగ్యసంజీవనిగా మారిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్టం చేయాల్సిన ప్రభుత్వం...వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు సిద్ధమైందని మండిపడ్డారు. కూటమి నేతలు 'సూపర్ సిక్స్' హామీల అమలుపై దృష్టి సారించకుండా కేవలం వైఎస్సార్‌సీపీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు... అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపారన్నారు.

బిల్లుల కోసం న్యాయ పోరాటం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు అడిగితే టీడీపీలో చేరాలని చెబుతున్నారని, ఇంతదారుణంగా దిగజారిన రాజకీయపార్టీని ఎక్కడా లేదన్నారు. బిల్లుల కోసం న్యాయంగా అడుగుతామని, లేదంటే న్యాయ పోరాటం చేసి కార్యకర్తలు నష్టపోకుండా కాపాడుకుంటామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తామన్నారు. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉన్నారని, రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ తప్పక అధికారంలోకి వస్తుందన్నారు. తొలిసారి ఛత్రం పంచాయతీలో ఆత్మీయ సమావేశం నిర్వహించిన రవిచంద్ర, సికిందర్, మంజునాథ్, అశ్వత్థ, సిద్దు చౌడప్ప, కార్యకర్తలు, నాయకులను ఆమె ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పార్టీ పటిష్టతకు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

అడ్డంకులను ఎదిరించి..

ఈచలెడ్డి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరగనివ్వకుండా కూటమి నాయకులు కుట్రలు చేశారు. అధికారాన్ని అండతో అడ్డంకులు సృష్టించారు. అయినా అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కుంచిటి వక్కలిగ అనుబంధ సంఘం అధ్యక్షుడు రంగేగౌడ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, మండల కన్వీనర్ రామిరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణయాదవ్, పార్టీ నాయకుడు జయరాజ్, మార్కెట్‌యార్డు మాజీ ఉపాధ్యక్షుడు బాబిరెడ్డి, బీసీ, ఎస్సీ సెల్ కమిటీ సభ్యులు శ్రీరాములు, తిమ్మప్ప, మంజునాథ్, నరసింహులు, లక్ష్మీనారాయణ, నాగభూషణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు నాగేంద్ర, విక్రమ్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిసిటీ కోసమే దావోస్ పర్యటన

మడకశిర రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ దావోస్ పర్యటనను తమ పబ్లిసిటీకి వాడుకున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. శుక్రవారం ఛత్రం పంచాయతీ ఈచలెడ్డి గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసువచ్చేందుకు కృషి చేయాల్సిన తండ్రీ కుమారుడు, అక్కడకు వెళ్లి కూడా రాజకీయ ప్రసంగాలు చేశారన్నారు. రూ.కోట్ల ప్రజాధనం ఖర్చుతో జల్సాలు చేశారన్నారు. పొరుగు రాష్ట్రాలు రూ.కోట్ల పెట్టుబడులు తీసుకువస్తుంటే చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ కేవలం ఫొటోలకు ఫోజులిచ్చేందుకే సమయమంతా గడిపేశారన్నారు. చంద్రబాబు దావోస్ పర్యటనతో రాష్ట్ర ఇమేజ్‌ను దెబ్బ తీశారన్నారు.

కందికి రూ.10 వేల మద్దతు ప్రకటించాలి

రైతులు పండించిన కందికి ప్రభుత్వం రూ.10 వేల మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. మహిళలపై అఘాయిత్యాలను కట్టడి చేయడంలో రాష్ట్ర హోం మంత్రి అనిత పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా... రైతుల కష్టాలను తీర్చలేకపోతున్నారని మండిపడ్డారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

తనకల్లు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మారుతీరావు తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన ఎక్సైజ్ అధికారులు నల్లచెరువు మండలం బాలేపల్లి తండా సమీపంలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ కారులో 14 బాక్సుల్లో తరలిస్తున్న 1,344 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న నల్లచెరువు మండలానికి చెందిన నాగేంద్ర, నాగభూషణాన్ని అరెస్ట్ చేశారు. కాగా, చిన్నయల్లంపల్లికి చెందిన నరసింహులుకు అక్రమ మద్యం రవాణాలో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేశారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: ఆడబిడ్డలు పుట్టింటికి ప్రాణమని, మెట్టినింటికి జీవమని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం అన్నారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రశాంతి గ్రామం వద్ద ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి బాలికా దినోత్సవంపై అవగాహన కల్పించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... సమాజంలో మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూడాలని లేదంటే భవిష్యత్తులో అనర్థాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఆడబిడ్డకూ గౌరవప్రదమైన జీవితం, విద్య, ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సోమందేపల్లి: మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన నరసింహప్ప (60) ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య లక్ష్మమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా ఆస్తమాతో బాధపడుతున్న ఆయన సోమందేపల్లిలోని ఆస్పత్రికి వెళుతున్నట్లు ఇంట్లో శుక్రవారం ఉదయం బయలుదేరి, గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


అనంతపురంలో రీ వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులు


❒ నేను పుట్టుకతోనే అంధుడిని. రెండు కళ్లు లేకపోవడంతో పదిహేనేళ్ల కిందటే వంద శాతం వైకల్యం కలిగినట్టు ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ జారీ చేసింది. నేను పాటలు పాడుకుంటూ వచ్చిన డబ్బుతో నా కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాను. తిరుపతిలో సంగీత కచేరీలో ఉన్న నాకు వెరిఫికేషన్ ఉందని నోటీసు ఇచ్చినట్లు చెప్పడంతో హుటాహుటిన ఇబ్బందులు పడుతూ ఇక్కడికి వచ్చాను.

– కృష్ణసాయి, ప్రశాంతినగర్, గుంతకల్లు


❒ నేను అంధుడిని. నా భార్య తాహెరా కూడా మూగ. నేను చిన్న చిన్న కచేరీలు, ఖవ్వాలీ కార్యక్రమాల్లో హార్మోనియం వాయిస్తూ వచ్చిన అరకొర డబ్బుతో జీవనం సాగిస్తున్నా. నాకు వైకల్య శాతం వందతో కూడిన సర్టిఫికెట్ ఉంది. వెరిఫికేషన్ కోసం ఆస్పత్రికి రానూపోనూ ఆటోకు రూ.100 ఖర్చయ్యింది. రెండు గంటల పాటు నిరీక్షించాను. దీంతో ఈరోజు పని కోల్పోవాల్సి వచ్చింది.

– మహమ్మద్ వలి, తిలక్‌నగర్, గుంతకల్లు

ఇవేం కష్టాలు బాబూ

- వైకల్య శాతం పునఃపరిశీలన
- వంద శాతం ఉన్నా వెళ్లాల్సిందే!
- ఆస్పత్రులకు ఉరుకులు పరుగులు
- రవాణా వ్యయంతో ఇబ్బందులు
- సౌకర్యాలు కల్పించని అధికారులు

అనంతపురం మెడికల్/ గుంతకల్లుటౌన్: కూటమి ప్రభుత్వం దివ్యాంగులను ముప్పుతిప్పలు పెడుతోంది. బోగస్ పింఛన్లకు చెక్‌పెట్టేందుకని రీ వెరిఫికేషన్ పేరిట ప్రభుత్వ ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తోంది. వంద శాతం వైకల్యం ఉన్న వారిని సైతం వెరిఫికేషన్‌కు రప్పిస్తోంది. ఆస్పత్రుల వద్ద దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాల్సిన వైద్య విధాన పరిషత్, డీఆర్‌డీఏ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. శుక్రవారం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఈఎన్‌టీ, సైకియాట్రీ, కంటి సమస్యతో బాధపడుతున్న దివ్యాంగులకు రీ వెరిఫికేషన్ చేపట్టారు. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి ఆయా విభాగాల వైద్య నిపుణులు, టెక్నికల్ సిబ్బంది లబ్ధిదారులకు స్క్రీనింగ్ నిర్వహించారు. ప్రతి విభాగం నుంచి రోజూ 50 మంది దివ్యాంగులకు స్క్రీనింగ్ నిర్వహించాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. బర్న్స్ వార్డులో మానసిక దివ్యాంగులు, ఈఎన్‌టీ వార్డులో చెవి, మూగ, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారికి, కంటి ఆపరేషన్ థియేటర్ వద్ద కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారికి స్క్రీనింగ్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దివ్యాంగులు ఎండలోనే ఉండడం వల్ల నీరసించిపోయారు. శనివారం కూడా దివ్యాంగులకు స్క్రీనింగ్ జరగనుంది. ఇప్పటికైనా నీడ కోసం షామియానాతో పాటు తాగునీటి సౌకర్యం కల్పిస్తారో లేదో చూడాలి.


అనంతపురం సర్వజనాస్పత్రిలోని బర్న్స్ వార్డు ముందు వెరిఫికేషన్ కోసం దివ్యాంగులు ఇలా..

గుంతకల్లులోనూ...

పెన్షన్ల ఏరివేతలో భాగంగా దివ్యాంగుల వైకల్యశాతం నిర్ధారణ కోసం వైద్య పరీక్షలు, సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలనకు శుక్రవారం గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో క్యాంప్ నిర్వహించారు. దివ్యాంగుల్లో మొదటి విడతగా అంధత్వ పింఛన్లు అందుకుంటున్న వారిని కంటి వైద్యనిపుణులు పరిశీలించారు. గుంతకల్లు మున్సిపాల్టీ పరిధిలో ప్రతి నెలా 1,641 మంది దివ్యాంగులు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్నారు. వీరిలో సుమారు 150 మంది పుట్టుకతో అంధులైన వారు, మధ్యలో కంటిచూపు కోల్పోయిన వారు ఉన్నారు. అయితే పింఛన్ వెరిఫికేషన్‌కు రావడానికి అంధులు నానా ఇబ్బందులు పడ్డారు. కనీస రవాణా సదుపాయాలు కల్పించకపోవడంతో కష్టాలు పడ్డారు. ఆటోలకు రూ.150 నుంచి 200 వరకు ఖర్చుచేసి ఆస్పత్రికి చేరుకున్నారు. 15 సంవత్సరాల నుంచి పింఛన్ పొందుతున్నప్పటికీ పునఃపరిశీలన పేరిట ఆస్పత్రికి తిప్పడంపై మదనపడుతున్నారు. నోటీస్ అందుకున్న తరువాత ఆస్పత్రికి వచ్చి పునఃపరిశీలన చేయించుకోకపోతే పింఛన్ తొలగిస్తామని అధికారులు పేర్కొనడంతో అష్టకష్టాలు పడి వచ్చామని లబ్ధిదారులు, వారి వెంట వచ్చిన సహాయకులు వాపోయారు. వివిధ కేటగిరీల కింద పింఛన్ పొందుతున్న దివ్యాంగులను వెరిఫికేషన్ పేరిట ఆస్పత్రులకు తిప్పకుండా వార్డు సచివాలయాలు లేదా ఇంటికెళ్లైనా పరిశీలన చేపట్టాలని వారు కోరుతున్నారు.

391 మందికి రీ వెరిఫికేషన్

అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి, గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన రీ వెరిఫికేషన్‌లో 391 మందికి స్క్రీనింగ్ నిర్వహించినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ పేర్కొన్నారు. ఇందులో అనంతపురం సర్వజనాస్పత్రిలో 183 మంది కంటి స్క్రీనింగ్, 71 మంది మూగ, చెవిటి, గొంతు స్క్రీనింగ్, మానసిక స్క్రీనింగ్‌కు 17 మంది, గుంతకల్లులో 120 మంది కంటి స్క్రీనింగ్ చేయించుకున్నట్లు తెలిపారు. శనివారం కూడా రీ వెరిఫికేషన్‌లో భాగంగా దివ్యాంగులకు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రిమాండ్‌కు చిత్తూరు వాసులు

కదిరి టౌన్: వృద్ధురాలిని మోసగించి ఆమె ఆస్తిని మరొకరిపై రిజిస్ట్రేషన్ చేయించిన కేసులో చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలు... కదిరిలోని బైపాస్ రోడ్డు వద్ద నివాసముంటున్న వృద్ధురాలు షేక్ నస్రీమ్ బేగం... తన అవసరాల నిమిత్తం గుడిసె దేవానంద్ వద్ద రూ.6లక్షలు అప్పుగా తీసుకుంది. ఇందుకు సంబంధించి తనకున్న 6.92 ఎకరాల భూమిని తనఖా పెట్టింది. తనఖా రిజిస్ట్రేషన్ అంటూ ఆమెను మోసం చేసి గుడిసె దేవానంద్ పేరున కొనుగోలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ కుట్రలో దేవానంద్‌తో పాటు ఆయన కుమారుడు సాయి దేవానంద్, డ్రైవర్లు.. చిత్తూరుకు చెందిన చరణ్‌కుమార్, శ్యామ్‌కుమార్ పాత్ర ఉంది. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన వృద్ధురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడంతో నలుగురు నిందితులు అజ్ఞాతంలోకి వెళ్లారు. అప్పటి నుంచి పోలీసులు గాలింపు కొనసాగుతూ ఉంది. ఈ క్రమంలో శుక్రవారం కదిరిలోని మదనపల్లి మార్గంలో కొలేపల్లి రైల్వేగేట్ వద్ద తచ్చాడుతున్న చరణ్‌కుమార్, శ్యామ్‌కుమార్‌ను పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, పరారీలో ఉన్న ప్రధాన ముద్దాయిలు గుడిసె దేవానంద్, గుడిసె సాయిదేవానంద్ కోసం గాలింపు కొనసాగుతోందని సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

గణతంత్ర ఉత్సవాలకు లేపాక్షి విద్యార్థి


సాయికిరణ్

లేపాక్షి: రాష్ట్ర రాజధాని అమరావతి వేదికగా ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవంలో పాల్గొనాలంటూ లేపాక్షిలోని ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది 10వ తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన సాయికిరణ్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం నుంచి శుక్రవారం జారీ అయిన ఉత్తర్వులను తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప... విద్యార్థి సాయికిరణ్‌కు అందజేసి అభినందించారు.

విద్యా శాఖలో నూతన సంస్కరణలు

- వచ్చే విద్యా సంవత్సరంలో జీఓ 117 రద్దు
- ప్రాథమికోన్నత పాఠశాలల్లో టెన్త్ వరకు చాన్స్
- సమీక్షలో పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు



మాట్లాడుతున్న పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, హాజరైన అధికారులు, ప్రధానోపాధ్యాయులు

అనంతపురం: విద్యాశాఖలో నూతన సంస్కరణలు తీసుకొస్తున్నట్లు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు తెలిపారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్య కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో సదరు జీఓ 117ను వచ్చే విద్యా సంవత్సరం (2025–26)లో రద్దు చేసి, విద్యా శాఖలో సంస్కరణలు అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో 44 వేల ప్రభుత్వ పాఠశాలలు, 14వేలు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 35 లక్షల మంది విద్యార్థులుంటే, ప్రైవేట్ పాఠశాలల్లో ఇంతకు మించి విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1.68 లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నా.. బోధన సక్రమంగా జరగలేదన్న విమర్శలు ఉన్నాయన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే ప్రాథమిక పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా చేస్తున్నామన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏడో తరగతి వరకే చదివే అవకాశం ఉండడంతో బాలికలు ఏడో తరగతి తర్వాత బడి మానేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రాథమికోన్నత పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివే అవకాశం కల్పిస్తే బాలికల అక్షరాస్యత శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు అనుమతి నిరాకరణ:

కీలకమైన విద్యాశాఖ సమీక్ష సమావేశానికి మీడియా ప్రతినిధులను అనుమతించలేదు. ఏకోపాధ్యాయ పాఠశాలలను రద్దు చేసి, ఉపాధ్యాయ పోస్టులు కోత పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఎంఈఓలకు అవగాహన కల్పించడానికి విద్యాశాఖ కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ అంశాలన్నీ బయటకు రాకుండా ఉండేందుకే మీడియాను సమావేశంలోకి అనుమతించలేదన్న విమర్శలు ఉన్నాయి.

ఈ–ఆఫీసుతోనే ప్రజలకు సత్వర సేవలు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: మారుతున్న కాలంతో సమానంగా సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు సత్వర సేవలందించేందుకు పోటీ పడాలని జెడ్పీ ఉద్యోగులకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. అనంతపురంలోని జెడ్పీ క్యాంపస్‌లో ఉన్న డీపీఆర్‌సీ భవన్‌లో శుక్రవారం ఈ–ఆఫీస్‌పై శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు. గిరిజమ్మ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయాల్లోనూ ఈ–ఆఫీస్ అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రతి ఫైలూ నిర్దిష్ట సమయంలో క్లియర్ అవడంతో పాటు సురక్షితంగా ఉంటాయన్నారు. ఈ–ఆఫీస్ అమలుతో ఎక్కడ, ఎవరి వద్ద ఫైలు ఎప్పటి నుంచి పెండింగ్ ఉందనే విషయం సులువుగా తెలిసిపోతుందన్నారు. ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలందించేందుకు దోహదపడే ఈ–ఆఫీస్‌ను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఏఓలు రత్నబాయి, కమ్మ నాగరాజు పాల్గొన్నారు.

ప్రేరేపిత ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలి

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్ డిమాండ్


విద్యార్థి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాంభూపాల్, తదితరులు

బత్తలపల్లి: కళాశాల ఫీజులు చెల్లించలేదని గంటల తరబడి విద్యార్థి చరణ్‌ను నిలబెట్టడంతో మనస్తాపానికి గురై మూడో అంతస్తు నుంచి దూకి మృతి చెందడం బాధాకరమని, ఇది ముమ్మాటికీ ప్రేరేపిత ఆత్మహత్యగానే భావించాల్సి వస్తుందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలంటూ సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్ డిమాండ్ చేశారు. అనంతపురం శివారులోని సోమలదొడ్డి వద్ద ఉన్న నారాయణ క్యాంపస్ కళాశాలలో గురువారం విద్యార్థి చరణ్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం బత్తలపల్లిలోని విద్యార్థి కుటుంబసభ్యులను రాంభూపాల్‌తో పాటు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరమేష్, దండోరా ధర్మవరం డివిజన్ అధ్యక్షుడు సాకే లక్ష్మన్న తదితరులు పరామర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. పాడిపోషణపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న వెంకటనారాయణకు ఇద్దరు కుమారులు కాగా, ఓ కుమారుడు ఆత్మహత్యతో ఆ కుటుంబం కోలుకోలేని స్థితిలో ఉందన్నారు. రూ.28లక్షలకు పైగా అప్పుల్లో కూరుకుపోయిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రహరీ లేకున్నా కళాశాల నిర్వహణకు అనుమతులు జారీ చేసిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను రెసిడెన్షియల్ కళాశాలలుగా మార్చి విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కళాశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం పూర్తిస్థాయిలో అమలు చేసి కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దందాను అరికట్టకపోతే రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఉపాధ్యక్షుడు దామోదర్, ఎస్కేయూ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, మోహన్ తదితరులు ఉన్నారు.

సీపీఐ నేతల పరామర్శ..

బత్తలపల్లిలోని విద్యార్థి చరణ్ తల్లిదండ్రులు తొలచూరు వెంకటనారాయణ, గోవిందమ్మ దంపతులను శుక్రవారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, బత్తలపల్లి మండల కార్యదర్శి బండల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బత్తల నాగభూషణ, వడ్డె సన్నపెద్దన్న పరామర్శించారు.

కారెనక కారు... వరుసగా నాలుగు కార్ల ఢీ


నుజ్జునుజ్జయిన ఓ కారు

రాప్తాడు: కారు వెనుక కారు... వరుసగా నాలుగు కార్లు ఢీకొన్న ఘటనతో రాప్తాడు శివారులోని 44వ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడం విశేషం. వివరాలు... శుక్రవారం సాయంత్రం రాప్తాడు శివారులోని ఓ ధాబా వద్ద అనంతపురంలోని నాయక్‌నగర్‌కు వెళ్లే మార్గం నుంచి ఓ కారు సడెన్‌గా జాతీయ రహదారిపైకి దూసుకువచ్చింది. అదే సమయంలో బెంగళూరు వైపుగా వెళుతున్న ఏపీ40 సీజెడ్ 2448 నంబర్ గల మహేంద్రా ఎక్స్‌యూవీ400 కారు డ్రైవర్ గమనించి బ్రేక్ వేయడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే మహేంద్ర కారు వెనుకలే ఒకదాని వెనుక ఒకటి చొప్పున వేగంగా వస్తున్న రెనాల్ట్ క్లైంబర్, ఇన్నోవా (ఏపీ02ఏజీ 6677), హుండాయి ఐ20 కార్లు వరుసగా ఢీకొన్నాయి. ఘటనతో ఒక్కసారిగా అన్ని కార్లలో బెలూన్లు తెరుచుకోవడంతో ఎవరూ గాయపడలేదు. కాగా, ప్రమాదానికి కారణమైన నాయక్ నగర్ వైపు నుంచి జాతీయ రహదారిపైకి దూసుకొచ్చిన కారు డ్రైవర్... వెంటనే అక్కడి నుంచి తన వాహనంతో ఉడాయించాడు. ఘటనలో ఢీకొన్న నాలుగు కార్లూ బాగా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి, ట్రాఫిక్ పునరుద్ధరించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కొండపై నుంచి కిందకు దొర్లిన రాళ్లు


కిందకొచ్చి పడిన ఓ బండరాయి

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి సమీపంలో ఉన్న అక్కమ్మగారి కొండపై నుంచి శుక్రవారం మధ్యాహ్నం రెండు పెద్ద బండరాళ్లు కిందకు దొర్లాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సాధారణంగా రోజూ పిన్నదరి, పుల్లానారాయణపల్లి, భీమరాయునిపేట, మద్దులచెరువు, ఏకపాదంపల్లి తదితర గ్రామాలకు చెందిన గొర్రెల కాపరులు, రైతులు ఆ ప్రాంతంలో తచ్చాడుతూ ఉంటారు. అయితే కొండరాళ్లు దొర్లి కిందకు వచ్చిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం అమ్మవారి మహిమగానే స్థానికులు చర్చించుకోవడం గమనార్హం.


డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణతో పదోన్నతులు పొందిన ఎస్‌ఐలు

విధుల్లో ప్రతిభ చాటాలి

- కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

కర్నూలు కల్చరల్: విధుల్లో ప్రతిభ చాటి పోలీసు శాఖకు ఖ్యాతి తేవాలని ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన ఏఎస్‌ఐలకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ పిలుపునిచ్చారు. రాయలసీమ రేంజ్‌లోని ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 1991 బ్యాచ్‌కు చెందిన తొమ్మిది మంది ఏఎస్‌ఐలు ఇటీవల ఎస్‌ఐలుగా పదోన్నతులు పొందారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వారు కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో డీఐజీ కోయ ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పదోన్నతులు రావడం అభినందనీయమని, మిగిలిన సర్వీసును కూడా రిమార్కు లేకుండా పూర్తి చేయాలని ఎస్‌ఐలకు డీఐజీ సూచించారు.